క్లుప్తంగా

ప్రమాదకరంగా రోడ్డు



రోడ్డు పక్కన ఏర్పడిన కోత

దౌల్తాబాద్: మండల పరిధి దేశాయిపల్లి నుంచి యాంకి గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు ప్రమాదకరంగా మారింది. మార్గ మధ్యలో ఒకదగ్గర రహదారి కొంతమేర కోతకు గురైంది. దీంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అసలే రోడ్డు విస్తీర్ణం చిన్నగా ఉందని, ఒక వైపు నుంచి వాహనాలు వస్తే.. మరో వైపు నుంచి వెళ్లడానికి ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నారు. అలాంటి రోడ్డు ఇలా కోతకు గురైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

ప్రసాద్‌కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలి



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సుభాష్‌యాదవ్

బంట్వారం: ఎస్సీ రిజర్వుడు వికారాబాద్ సెగ్మెంట్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుభాష్‌యాదవ్ కోరారు. సోమవారం ఆయన పార్టీ శ్రేణులతో నగరంలో ప్రసాద్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసిన అనుభవం ఉన్న ఎమ్మెల్యేకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలన్నారు. పార్టీ నాయకులు దివాకర్, నర్సింగ్ యాదవ్, శేఖర్ యాదవ్, మల్లేశ్ యాదవ్, శివ కుమార్ యాదవ్, రతన్ ఉన్నారు

ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

పూడూరు: పరిగి ఎమ్మెల్యేగా రామ్మోహన్‌రెడ్డి గెలవడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం దామగుండం రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమ మాట్లాడారు. పార్టీ చెప్పిందే చేస్తుందని, ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతుందని చెప్పారు. డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, శ్రీనివాస్, నాయకులు నారాయణ, పరశురాం, రాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు మండలంలో బీఆర్‌ఎస్‌కు ఆధిక్యం

తాండూరు రూరల్: తాండూరు మండలంలో బీఆర్‌ఎస్ హవా కొనసాగింది. నాయకుల ఐక్యత రోహిత్‌రెడ్డికి కలిసి వచ్చింది. దీంతో ఆ పార్టీ అధిక్యత సాధించింది. బీఆర్‌ఎస్‌కు–15,634 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డికి–15,129 ఓట్లు పోలయ్యాయి. దీంతో రోహిత్‌రెడ్డికి 505 మెజార్టీ లభించింది. అన్ని చోట్లా కాంగ్రెస్ హవా కొనసాగినా.. మండలంలో ఆ ప్రభావం పడలేదు. ఇది ఆ పార్టీ మండల నాయకులు, కార్యకర్తల ఐక్యతతోనే మెజార్టీ సాధ్యం అయిందని చెప్పవచ్చు.

ప్రభావం చూపని జంపింగులు

ఎన్నికల ముందు మంత్రి మహేందర్‌రెడ్డి ప్రధాన అనుచరులు ఎంపీపీ అనితగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీను, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాందాస్‌తో పాటు పలువురు ఎంపీటీసీ, సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయినా ఓటింగ్‌పై ఎలాంటి ప్రభావం చూపలేదు.

ఆర్థిక సహాయం

తాండూరు రూరల్: మండల పరిధి మల్కాపూర్ గ్రామానికి చెందిన అంజిలప్ప సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు రావులపల్లి చంద్రశేఖర్ గౌడ్ మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

సంబురాలకు దూరం

మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులది వింత పరిస్థితి. ఓ వైపు ఎమ్మెల్యే అభ్యర్థి ఓడిపోయినందుకు విచారించాలో.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని ఉత్సాహ పడాలో కాంగ్రెస్ శ్రేణులు తేల్చుకోలేక పోతున్నారు. మరోవైపు గులాబీ శ్రేణులు.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయిందని బాధపడాలో.. స్వల్ప మెజార్టీతో ఎమ్మెల్యే గెలిచారని సంతోషపడాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఇటు కాంగ్రెస్ కార్యకర్తలు కానీ.. అటు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కానీ.. నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాల తరువాత పెద్దగా సంబురాలు జరుపుకోలేదు.

కూలీల కరువు.. పత్తితీత బరువు

విత్తు విత్తింది మొదలు దిగుబడి చేతికి వచ్చేవరకు నిత్యం రైతులకు సవాళ్లు ఎదురవుతున్నాయి. మొలకెత్తిన నాటి నుంచి వరుణుడు సహకరించాలి. పంట చేతికి వచ్చాక అమ్ముకోవడానికి ప్రభుత్వం మద్దతు కల్పించి ఆదుకోవాలి. ఇవన్నీ ఒకటైతే కూలీల కొరత పెద్ద సమస్య. కొంత కాలంగా కూలీలు దొరకక కష్టంగా మారింది. రైతులు కూలీల కోసం తిప్పలు పడాల్సి వస్తోంది.

- ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న రైతులు
- పెరిగిన కూలీ ధరలు.. భారంగా మారిన వైనం



కూలీలు దొరకక నేల రాలుతున్న పత్తి

దౌల్తాబాద్: పంట చేతికొచ్చిన సమయంలో కూలీలు దొరకక పత్తి రైతులు సతమతమవుతున్నారు. మొక్కజొన్న, తెల్ల బంగారం ఒకేసారి కోతకు రావడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకురావాలంటే వ్యయ భారం అధికమవుతోందని రైతులు పేర్కొంటున్నారు. ఇందులో పెద్ద రైతులు పోటీపడుతుండటంతో చిన్న, సన్నకారు రైతులకు అంత సొమ్ము చెల్లించే స్థోమత లేక.. ఆందోళనకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పత్తి కొనుగోళ్లు సైతం ఊపందుకోగా.. ఇక్కడ మాత్రం పంట చేలల్లో మగ్గుతోందని ఆవేదన చెందుతున్నారు.

క్వింటాకు రూ.1200

ఏడాది క్రితం వరకు కిలో పత్తి తీతకు రూ.9 కూలీ ఉండగా.. ప్రస్తుతం అది 12కు చేరి, క్వింటాకు రూ.1100–1200 వరకు కూలీ చెల్లించాల్సి వస్తోందని పలువురు రైతులు చెప్పారు. అంతే కాకుండా ఏరిన తరువాత ఇంటికి తరలించేందుకు ఇతర ప్రాంతాల కూలీలకు అదనంగా డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ లెక్కన ఎకరా పొలంలో ఎనిమిది నుంచి 10 క్వింటాళ్ల పత్తి పండితే.. దానికి సుమారు రూ.12వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. సాగు సమయంలో ఎరువులు, పురుగు మందులకు అయ్యే వ్యయంతో పాటు పత్తి ఏరేందుకు అయ్యే మొత్తంతో కలిపితే.. ఖర్చు అమాంతం పెరిగి, ఆదాయంపై ప్రభావం పడుతోందని రైతులు చెప్పారు.

యంత్రాలు ఎప్పుడొస్తాయో?

సాగులో యాంత్రీకరణ పెరుగుతున్న దశలో.. పత్తిని పొలం లోంచి తీసే యంత్రం అందుబాటులోకి రాలేదు. కొంత కాలంగా వ్యవసాయ అధికారులు పత్తిని తీసే యంత్రం వచ్చిందని, ముందు డెమో చేసి చూపిస్తామని చెబుతున్నారే తప్పా.. కార్యరూపం దాల్చడానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం రైతులు ఆరోపిస్తున్నారు. అయితే యంత్రం వస్తుందని, కానీ దాన్ని ఉపయోగిస్తే సమస్యలు వస్తాయని వారే చెప్పినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా.. పత్తి తీతకు యంత్రాలు లేక, కూలీల కోరతతో పంట చేలోనే నేల రాలుతుందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

మోమిన్‌పేట: అయ్యప్ప కాటన్ ట్రేడరులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించామని మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు దిగుబడిని తీసుకు వచ్చే ముందు.. ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్సు కాపీలను తమవెంట తీసుకురావాలని సూచించారు. బ్యాంకు ఖాతాకు ఆధార్, ఫోన్ నంబరు అనుసంధానమై ఉండాలని చెప్పారు. ఎకరాకు 12క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని, క్వింటా పత్తికి రూ.7,020లుగా మద్దతు ధర ఉందని వెల్లడించారు. పత్తిలో తేమ 8శాతం కంటే.. ఎక్కువగా ఉంటే ధరలో వ్యత్యాసం ఉంటుందని, గరిష్టంగా 12శాతం వరకు కొనుగోలు చేయబడుతుందని స్పష్టం చేశారు. అయితే 8శాతం నుంచి ఒక్కో శాతం పెరిగిన కొద్దీ రూ.70లు తగ్గుతుందని, ఇది రైతులు గమనించాలని కోరారు.



తేమ శాతం పరిశీలిస్తున్న సీసీఐ అధికారులు

నేడు పార్కింగ్ వేలం

ధారూరు: నేటి నుంచి క్రిస్టియన్ జాతర ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా భక్తుల వాహనాల పార్కింగ్ సౌకర్యార్థం కొరకు మంగళవారం ఉదయం 10 గంటలకు స్టేషన్‌ధారూరు, దోర్నాల్‌లో బహిరంగ వేలం వేయనున్నట్లు ఆ గ్రామ కార్యదర్శులు రేఖ, మహబూబ్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.3 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. పార్కింగ్ రుసుముగా టూ వీలర్‌కు రూ.50, ఫోర్ వీలర్‌కు రూ.100 వసులు చేసేందుకు అనుమతి ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. గతేడాది ఉత్సవం సందర్భంగా పార్కింగ్ అనుమతి పొందిన వారు రోడ్లపై వాహనాలను అడ్డగించి, బలవంతపు వసూళ్లకు పాల్పడ్డారని, అలాంటి చేయవద్దని సూచించారు. నిర్దీత స్థలంలో నిలిపిన వాహనాలకు మాత్రమే ఫీజు వసూలు చేయాలని కోరారు.

పాదయాత్రగా వెళ్లి మొక్కు తీర్చుకుని..

బొంరాస్‌పేట: పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి గెలవాలని మొక్కుకున్నానని, ఆయన విజయం సాధించడంతో మొక్కు చెల్లించుకునేందుకు వెళ్తున్నానని మహంతీపూర్ సర్పంచ్ మహిపాల్ అన్నారు. సోమవారం ఆయన స్థానికులతో కలిసి కొడంగల్ శ్రీమహాలక్ష్మి, వేంకటేశ్వర స్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లి, మొక్కు తీర్చుకొని ముడుపులు చెల్లించారు. అనంతరం మాట్లాడారు. ఐదేళ్ల పాటు చల్లంగా రేవంత్ పాలన కొనసాగించేలా దీవించాలని దేవున్ని కోరుకున్నాని పేర్కొన్నారు.

సోనియా రుణం తీర్చుకున్న ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: అమరుల త్యాగాలకు చలించి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణాన్ని రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించి తీర్చుకున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, మార్కెట్ వైస్ చైర్మన్ రామేశ్వర్‌లు అన్నారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ సెగ్మెంట్ బరిలో నిలిచిన పార్టీ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించడం అభినందించదగ్గ విషయమని చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటు అనంతరం.. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీసీసెల్ మండల అధ్యక్షుడు సర్వేశ్, మాజీ సర్పంచ్‌లు సుభాష్‌యాదవ్, పాండునాయక్, మాజీ ఉప సర్పంచ్‌లు జాఫర్, రాములు, సీనియర్ నాయకులు రాములు, దివాకర్, శ్రీనివాగుప్తా, రాచన్న, మల్లేశ్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్, జనార్దన్‌రెడ్డి, పంతులుబాయి శ్రీనివాస్, నారాయన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

యాలాల: కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి తనయుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా బుయ్యని మనోహర్‌రెడ్డికి యాలాల మండలం నుంచి 1,987 ఓట్ల మెజార్టీ రావడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా సోమవారం తాండూరు పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు డాక్టర్ సంపత్‌కుమార్‌ను పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మైనొద్దీన్, నాగయ్య, మోయిజ్, చందు, అహ్మద్, చిన్నా, బషీర్, శ్రీనివాస్, లాలప్ప తదితరులు ఉన్నారు.



సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న రాజేందర్‌రెడ్డి

వలస నేతకే పట్టాభిషేకం

సాధారణ ఎన్నికల నేపథ్యంలో మొన్నటి వరకు ప్రచారంలో.. నేను లోకల్ అంటే నేను అంటూ ఇద్దరు నేతలు ప్రజాక్షేత్రంలో దూసుకుపోయారు. ఇక్కడే పుట్టాను ఇక్కడే చస్తాను అంటూ ఒకరు, మూడు దశాబ్దాలుగా ఇక్కడే ఉన్నానంటూ మరొకరు ఓటర్లను ఆకట్టుకున్నారు. ప్రజలు మాత్రం.. తమ తీర్పుతో వలస నేత బీఎంఆర్‌కు పట్టంకట్టి అసెంబ్లీకి పంపారు.

- పార్టీలో చేరిన 59 రోజులకే విజయం
- తాండూరు నుంచి అసెంబ్లీలో అడుగు పెట్టనున్న మనోహర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మనోహర్‌రెడ్డి (ఫైల్)

తాండూరు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి తాండూరు టికెట్ విషయంలో నెల రోజుల క్రితం వరకు తీవ్ర పోటీ నెలకొంది. బలమైన నేతలు తలపడ్డారు. హస్తిన బాట పట్టి మంతనాలు జరిపారు. కానీ అధిష్టానం మాత్రం.. బీఆర్‌ఎస్ నుంచి వలస వచ్చిన బుయ్యని మనోహర్‌రెడ్డికి మొగ్గుచూపింది. ఎన్నికల బరిలోకి దింపింది.

మంచి తనానికి మారుపేరు..

పరిగి నియోజవకర్గం కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన బుయ్యని.. 2023 ఎన్నికల్లో నాటి అధికార పార్టీ బీఆర్‌ఎస్ నుంచి పరిగి టికెట్ ఆశించి భంగపడ్డారు. అనంతరం అక్టోబర్ 6న కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇక నాటి నుంచి మొదలైన ఆయన హస్తం ప్రస్థానం కొద్దిరోజుల్లోనే బలపడింది. పార్టీలో పట్టు సాధించారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు అండగా నిలిచారు. మంచి తనానికి మారుపేరుగా నిలిచిన వ్యక్తిగా జిల్లాలోనే బీఎంఆర్‌కు గుర్తింపు పొందారు. పాతికేళ్ల క్రితం వ్యాపార రీత్యా.. తాండూరు పట్టణంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని ఇక్కడే ఉన్నారు. స్థానిక చిరునామాతోనే ఓటరు గుర్తింపు కార్డు కూడా ఉంది. అయినా.. నాన్ లోకల్ బుయ్యని అంటూ.. నాటి అధికార పార్టీ ప్రధాన అస్త్రంగా మలుచుకొని ఎన్నికల్లో ఆయనపై దుష్ప్రచారం ప్రచారం చేసింది. అయినా మొక్కవోని మనోధైర్యంతో కారును ఢీకొన్నారు.

కేఎల్‌ఆర్‌తో ఢీ

అసెంబ్లీ టికెట్ కోసం కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీర్‌రెడ్డి లాంటి మహామహా నేతలు పోటీ పడ్డారు. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేశారు. అయినా బుయ్యని మాత్రం పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని నమ్ముకొని తాండూరులో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. టికెట్ కోసం తలపడిన వారి అంచనాలను తల్లకిందులు చేస్తూ అక్టోబర్ 27న కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ దక్కించుకున్నారు. అసెంబ్లీ బరిలోకి దిగారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, నాటి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డితో తలపడ్డారు. ఆయనకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునిత, ఆమె భర్త డాక్టర్ సంపత్‌కుమార్‌తో పాటు పార్టీ పెద్దలు ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌లు, పార్టీ కార్యకర్తలు, నాయకులు అండగా నిలిచారు. రేవంత్‌రెడ్డి, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే. శివకుమార్‌లు ఒకే రోజు ఆయనకు మద్దతుగా విస్తృత ప్రచారం చేసి బుయ్యనిని బలోపేతం చేశారు. వెరసి ఇవన్నీ ఆయన గెలుపునకు కారణం అయ్యాయి.

బుయ్యని ప్రొ ఫైల్

పేరు : బుయ్యని మనోహర్‌రెడ్డి
పుట్టిన తేది: 05–08–1965
స్వస్థలం: తిర్మలాపూరం, కుల్కచర్ల మండలం
చదువు: 10వ తరగతి
రాజకీయ ప్రస్థానం:
- 1987లో టీడీపీలో యువజన నేత
- 1995లో పరిగి నియోజవకర్గ సమన్వయ కమిటీ సభ్యుడు
- 1996లో డీసీఎంఎస్ డైరెక్టర్, రంగారెడ్డి జిల్లా
- 2006లో కుల్కచర్ల మండలం జెడ్పీటీసీ
- 2014లో బీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు
- 2020లో కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగింపు

వ్యాపారాలు:
- జేబీ ఇన్‌ఫ్రా గ్రూప్ మెనేజింగ్ డైరెక్టర్, బీఎంఆర్ సర్త కన్వేన్షన్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, వైద్య రంగం

పేదల అభ్యున్నతికి దళితబంధు



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు

- కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పథకాన్ని నిరంతరం కొనసాగించాలి
- లేదంటే ఆందోళనలు తప్పవు
- సర్పంచ్‌ల సంఘం మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

యాలాల: పేద దళితుల అభ్యున్నతికి ఉపయోగపడే దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిర్విరామంగా కొనసాగించాలని సర్పంచుల సంఘం యాలాల మండల ఉపాధ్యక్షుడు, హాజీపూర్ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం.. దళిత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. జరిగిన ఎన్నికల్లో పేదలకు మంచి జరుగుతుందన్న నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు అవకాశం ఇచ్చారని, ఈ నమ్మకాన్ని వమ్ముచేసుకోవద్దని హితవుపలికారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు దళితబంధు, గృహలక్ష్మి పథకాలను కూడా కొనసాగించాలని కోరారు. పేదలకు లబ్ధి చేకూర్చే పథకాలను నిలిపివేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపట్టడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. అంతే కాకుండా ఇప్పటి వరకు ఈ పథకాలకు అర్జీ పెట్టుకొని అర్హత పొందిన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను అందించాలని కోరారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శంకిరి మల్లేషం, చెన్నారం రవికుమార్, కోళ్ల కృష్ణ, శేఖర్, మల్లేషం, రాజు, పకీరప్ప, కాశప్ప, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మహాపడి పూజ

అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్‌రూరల్: అయ్యప్పస్వామి 18వ మహాపడి పూజలను పల్లె భాస్కర్‌రెడ్డి ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల పరిధి కనకమామిడి అయ్యప్ప సన్నిధిలో పల్లె సుశీల, మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో నారికెళ్ల గురుస్వామి భాస్కర్‌రెడ్డి మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములు క్రిషన్ గురుస్వామి, ఉమాశంకర్‌రెడ్డి, రాంచందర్ పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి మహామంగళ హారతిని సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు, భజన మండలి బృందం రాజు ఆలపించిన అయ్యప్పస్వామి భక్తిగీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ పూజల్లో వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న అయ్యప్ప భక్తులు

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

మండల విద్యాధికారి హరిశ్చందర్



మాట్లాడుతున్న ఎంఈఓ హరిశ్చందర్

పరిగి: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయులు యూడైస్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందు పర్చాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల వివరాలతో పాటు, బోధనా, బోధనేతర సిబ్బంది వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు.. విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం పాఠశాలల వసతుల గురించి ఆరా తీశారు.

భక్తిశ్రద్ధలతో ..

మొయినాబాద్‌రూరల్: మండలంలోని పలు దేవాలయాల్లో సోమవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. మండలంలోని సంగమేశ్వర దేవాలయంతో పాటు స్వామి నారాయణ గురుకుల్ లోటస్ టెంపులు, హిమాయత్‌నగర్ సోమేశ్వర ఆలయం, ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించేందుకు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. దీంతో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పూజారులు భక్తులకు దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

అభివృద్ధికి మరింత కృషి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ శంకర్‌పల్లి మండల నాయకులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. తనకు మూడోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన ప్రజలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ వెంకటేశ్, సర్పంచ్‌లు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, నాయకులు సాత ప్రవీణ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, రాఘవేందరెడ్డి, ఫరీద్, బాలకృష్ణ పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డ యాదన్న అడ్డా

మొయినాబాద్‌రూరల్: ఎమ్మెల్యే కాలె యాదయ్య హ్యాట్రిక్ విజయంపై బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యే యాదయ్య.. విజయానంతరం అజీజ్‌నగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవియాదవ్, అజీజ్‌నగర్ సర్పంచ్ సంధ్య శ్రీశైలం తదితరులు ఘనస్వాగతం పలికి, సన్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాణిక్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల ఎమ్మెల్యేగా మూడోసారి యాదయ్య గెలుపు మనందరి కృషి అని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మత్స్యకార్మిక సంఘం జిల్లా చైర్మన్ వెంకటాపూర్ బాలరాజ్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



హ్యాట్రిక్ సాధించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను సోమవారం చించల్‌పేటలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపిన గంగ్యాడ గ్రామస్తులు – నవాబుపేట